dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 12 | 17 సోమవారం, ఆగస్టు 2026

# నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

### ప్రజలు తమ దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి..

### ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, డీసీ**




ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 17వ తేదీ నుంచి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహిస్తున్నందున, తమ సమస్య లు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవస రం లేదని ఆమె స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీ లించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందు బాటులో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖా స్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు.

## ఎక్కడ ఏ ఉన్నతాధికారి అంటే

**కరీంనగర్ డీసీ**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండలంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, మానకొండూర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, సైదాపూర్‌లో ట్రైనీ కలెక్టర్, చిగురుమామిడిలో డీపీఓ ప్రత్యేక అధికారిగా హాజరుకానున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పాల్గొంటారు. అలాగే సంబంధిత మండలాల నుంచి సీఈఓ, డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారులు కూడా ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

## వారానికోసారి.. గంటన్నర

### ఊరుకోసం శ్రమదానం..

### వెలిచాలలో వరుసగా మూడో ఆదివారం శ్రమదానం



**రామడుగు డీసీ**

వారానికోసారి గంటన్నరపాటు గ్రామంలో శ్రమదానం నిర్వహించనున్నట్టు వెలిచాల సర్పంచ్ వీర్ల నర్సింగారావు తెలిపారు. రామడుగు మండలంలోని వెలిచాల గ్రామ పంచాయతీ పరిధిలోని గుడివెలుగులపల్లిలో ఆదివారం పాలకవర్గం ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగారావు మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం శ్రమదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే రెండు వారాలు శ్రమదానం చేసినట్టు తెలిపారు. మూడో ఆదివారం పంచాయతీ పరిధిలోని గుడివెలుగులో పల్లిలో నిర్వహించినట్టు ఆయన చెప్పారు. గ్రామంలో అన్ని వీధులను శుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాల పరిశు భ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. గ్రామస్తులు, యువకులు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉచిత శిక్షణ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

**కరీంనగర్ డీసీ :**

బిసి స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందే చేరుకున్నారు. జ్యోతిష్మతి, వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9:00 నుంచి 11:00 వరకు మొదటి షిఫ్ట్, పరీక్షలు నిర్వహించారు. హాల్ టికెట్ తో పాటు గుర్తింపు కార్డు ఉంటేనే అభ్యర్థులను పరీక్ష రాసేందుకు అనుమతించారు.ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ పరీక్షకు మొత్తం 101 మంది హాజరైనట్టు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ప్రణవ్ బాబు

**హుజూరాబాద్ డీసీ**

కరీంనగర్-వరంగల్ రహదారి పై మధువని గార్డెన్స్ సమీపంలో కారు బైక్ ఢీకొని యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తన వాహనాన్ని ఆపి, అంబులెన్స్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు. గాయాలైన యువకుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రి తరలించారు.